RNI No.: TELTEL/2023/90269

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

# TELANGANA SHAAN

Telugu Daily

విలేకరులు కావలెను

తెలంగాణ షాన్

తెలుగు దినపత్రిక

నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్చార్జ్‌లు
మండలాల వారిగా విలేకరులు కావలెను

ఆసక్తి గల యువతీ యువకులు

సంప్రదించవలసిన మొబైల్
నెంబర్: 99637 08331

Malkajgiri | Volume: 3 Issue: 79 | Tuesday, July 1, 2025 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/-

మల్కాజిగిరి | సంపుటి : 3 సంచిక : 79 | మంగళవారం, జూలై 1, 2025 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజీలు : 4 | వెల : రూ.4 /-

## తెలంగాణ బీజేపీ అధ్యక్షుడుగా రామచంద్రరావు!



**హైదరాబాద్:** తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవిపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. పార్టీ రాష్ట్ర నూతన సారథిగా మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు బాధ్యతలు చేపట్టనున్నారు. పార్టీ అధ్యక్ష పదవికి రామచంద్రరావు పేరును పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. దీంతో అధ్యక్ష ఎన్నిక నామినేషన్ గడువు ముగిసే సమయానికి ఒకే ఒక్క నామినేషన్ దాఖలైంది. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు రామచంద్రరావు నిన్న నామినేషన్ దాఖలు చేశారు. అధ్యక్షుని ఎన్నిక ఏకగ్రీవం అయింది. రామచంద్రరావు ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎంపిక లాంఛనప్రాయం అయింది.

పార్టీ అధ్యక్ష పదవి రేసులో బండి సంజయ్, ధర్మపురి అరవింద్, కె. లక్ష్మణ్, డీకే అరుణ, రాజా సింగ్ తదితరుల పేర్లు వినిపించినప్పటికీ, పార్టీ అధిష్టానం రామచంద్రరావు వైపు మొగ్గుచూపింది. పార్టీ అధ్యక్ష పదవిని ఆశించిన ఎమ్మెల్యే రాజాసింగ్ ఏకంగా పార్టీకి రాజీనామా చేశారు. రామచంద్రరావు పేరును ఆర్ఎస్ఎస్‌తో పాటు కొందరు సీనియర్ నేతలు బలంగా ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. దీంతో పార్టీ అధిష్టానం ఆదేశాలతో అధ్యక్ష పదవికి ఆయన నామినేషన్ దాఖలు చేశారు. ఈ రోజు అధికారిక ప్రకటన వెలువడనుంది. అయితే, ఇప్పటికే రామచంద్రరావుకు పలువురు పార్టీ నేతలు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

### రాజాసింగ్ సంచలన నిర్ణయం..

## బిజెపికి రాజీనామా.!



**హైదరాబాద్:** బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. రామచంద్రరావుకు బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వడంపై అసంతృప్తి చెందానని ఆయన తెలిపారు. బిజెపి అధ్యక్ష పదవికి నామినేషన్ వేయడానికి తాను పార్టీ ఆఫీస్‌కు వచ్చానని.. ఆ సమయంలో తన మద్దతుదారులను బెదిరించారని ఆయన ఆరోపించారు. తన రాజీనామా లేఖను కిషన్‌రెడ్డికి అందించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడి పదవి ఎవరికి ఇవ్వాలో ముందే డిసైడ్ చేశారని అన్నారు. పార్టీ సింబల్ మీద తాను గెలిచానని.. స్పీకర్‌కు కూడా రాజీనామా లేఖను కిషన్‌రెడ్డినే పంపించాలని ఆయన పేర్కొన్నారు. మీకో దండం, మీ పార్టీకో దండం అని ఆయన అన్నారు. కొందరు నేతలు వ్యక్తిగత ప్రయోజనాలతో పార్టీని తప్పుదారి పట్టిస్తున్నారని రాజాసింగ్ పేర్కొన్నారు. తాను, తన కుటుంబం టెర్రరిస్టు టార్గెట్‌లో ఉందని తెలిపారు. తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావాలని ఎంతో పోరాడుతున్నామని.. కానీ పార్టీ అధికారంలోకి రావొద్దని కోరుకునే వారే పార్టీలో ఎక్కువ మంది ఉన్నారన్నారు. పార్టీ కోసం ఇంత పని చేసిన మాకు ఏం లాభం అని ప్రశ్నించారు. పార్టీకి రాజీనామా చేశాను కానీ.. హిందుత్వం కోసం పోరాడుతూనే ఉంటానని స్పష్టం చేశారు.

## క్వాంటమ్ కంప్యూటింగ్‌ను మనం అందిపుచ్చుకోవాలి : చంద్రబాబు




**అమరావతి:** తాను తొలిసారి సిఎం అయినప్పుడు ఐటి పరిశ్రమ విస్తరిస్తోందని చెప్పానని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. అమెరికాకు సిలికాన్ వ్యాలీ ఎలాగో అమరావతికి క్వాంటం వ్యాలీ అలాగని, క్వాంటం శాటిలైట్ ఆవిష్కరణలతో సరికొత్త సాంకేతిక విప్లవానికి నాంది పలికామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నూతన ఆవిష్కరణలకు ఆకాశమే హద్దు అని క్వాంటం కంప్యూటింగ్ ను ప్రమోట్ చేసేందుకు ముందుంటానని అన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ ను మనం అందిపుచ్చుకోవాలని సూచించారు. తమతో కలిసి వచ్చిన టిసిఎస్, ఐబికి, ఎల్ అండ్ టికి అభినందనలు తెలియజేశారు. బిల్డగేట్స్ ను కలిసి ఐటీ విస్తరణ గురించి చర్చించానని పిపిపి మోడల్ లో హైటెక్ సిటీ కట్టాలని ఎల్ అండ్ టీని కోరానని అన్నారు. తర్వాత బెంగళూరు, గుర్గామ్ లోనూ ఐటి భవనాలు కట్టిందని, భవిష్యత్తులో భారత్ అదిపెద్ద ఐటి హబ్ గా మారుతుందని ఆనాడే చెప్పానని అన్నారు. జనవరి 1 నుంచి ఎపిలో క్వాంటమ్ వ్యాలీ కార్యకలాపాలు నిర్వహిస్తామని, అమరావతిలో టెక్ వ్యాలీ పార్కులోనే లక్షల మందికి ఉద్యోగావకాశాలు వస్తాయని అన్నారు. ఇతర రాష్ట్రాలూ సేవలు వినియోగించుకునే వెసులుబాటు ఉంటుందని, అనేక రంగాల్లో విస్తృతంగా క్వాంటమ్ సేవలు జరుగుతాయని పేర్కొన్నారు. క్వాంటమ్ మిషన్ కు కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చిందని చంద్రబాబు స్పష్టం చేశారు.




**సంగారెడ్డి:** తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలోని ఒక కర్మాగారంలో రసాయన రియాక్టర్‌లో ఈ ఉదయం జరిగిన పేలుడులో ఆరుగురు మృతి చెందగా, 20 మంది గాయపడ్డారు, వారిలో కొందరు తీవ్ర స్థాయిలో గాయపడ్డారు. సిగాచి ఇండస్ట్రీస్‌లో పేలుడు సంభవించిందని, దీనితో ఆ కర్మాగారంలోని కొన్ని భాగాలు అగ్నికి ఆహుతయ్యాయని పోలీసులు తెలిపారు.


హెచ్చరిక అందగానే, 11 అగ్నిమాపక యంత్రాలు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయగలిగాయి. పేలుడు శక్తి కార్మికులను గాల్లోకి విసిరివేసిందని, కొంతమంది 100 మీటర్ల దూరంలోకి దిగారని తెలుస్తోంది. సంఘటన జరిగిన సమయంలో దాదాపు 30 మంది కార్మికులు విధుల్లో ఉన్నారని ఫ్యాక్టరీ యాజమాన్యం తెలిపింది. ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే మరణించగా, మరొకరు ఆసుపత్రిలో గాయాలతో మరణించారు. ఈ పేలుడు కారణంగా ఫ్యాక్టరీ తయారీ మరియు పరిపాలనా భవనాలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది.

గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. గాయాల తీవ్రత దృష్ట్యా మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. పేలుడు తీవ్రత మరియు బలమైన రసాయన పొగలు వెలువడుతున్న కారణంగా, ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు చుట్టుపక్కల ప్రాంతాలను ఖాళీ చేయించారు. సంగారెడ్డి కలెక్టర్ ప్రవీణ్య మరియు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పరితోష్ సంఘటనా స్థలాన్ని సందర్శించి, సహాయ మరియు రక్షణ కార్యకలాపాలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ఈ విషాదం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు మరియు ప్రాణాలను కాపాడటానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారికి సాధ్యమైనంత ఉత్తమమైన వైద్య సంరక్షణ అందేలా చూడాలని కూడా ఆయన ఆదేశించారు.

### సిగాచీ బ్లాస్ట్ బాధితులకు ప్రధాని సంతాపం

## మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల నష్టపరిహారం



న్యూఢిల్లీ : సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన అగ్నిప్రమాదంలో చాలా మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు ప్రధాని మోదీ. ఈ ప్రమాదంలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తునట్లు చెప్పారు. కాగా, మృతుల బంధువులకు ప్రధాన మంత్రి సహాయ నిధి నుంచి ఒక్కొక్కరికి రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50,000 ఎక్స్ గ్రేషియా ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

## సిగాచి పరిశ్రమ ప్రమాదంపై న్యాయ విచారణ జరపాలి: హరీష్ రావు



హైదరాబాద్: రియాక్టర్ పేలుడులో బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు. ఇది పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే అని మండిపడ్డారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పేలుడులో ఎంతమంది చనిపోయారో క్లారిటి ఇవ్వాలని అన్నారు. ప్రమాదంపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పాశమైలారంలో సిగాచి పరిశ్రమలో జరిగే బాంబు పేలుడు ఇది మూడో ఘటన అని హరీష్ రావు పేర్కొన్నారు.

## త్వరలో కర్ణాటక సిఎంగా డికె శివకుమార్



**బెంగళూరు:** ప్రస్తుతం కర్ణాటక డిప్యూటీ ముఖ్యమంత్రిగా ఉన్న డికె శివకుమార్ 2,3 నెలల్లో సిద్దరామయ్య స్థానే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్ ఏ ఇక్బాల్ హుస్సేన్ పేర్కొన్నారు. కొద్ది నెలలుగా కర్ణాటకలో ముఖ్యమంత్రిని అధిష్టానం మార్చే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. సెప్టెంబర్ తర్వాత కర్ణాటక రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటాయని ఈ మధ్యనే సహకార శాఖమంత్రి కెఎన్. రాజన్న సంచలన ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలోనే డికె శివకుమార్ కు సన్నిహితుడైన ఇక్బాల్ హుస్సేన్ చేసిన తాజా ప్రకటన చర్చనీయాంశం అయింది. కర్ణాటకలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చేందుకు డికె శివకుమార్ తీవ్రంగా కృషి చేశారన్న విషయం అందరికీ తెలుసునని, అధిష్టానం కూడా డికె శివకుమార్ పట్ల సానుకూల ధోరణితోనే ఉందని హుస్సేన్ తెలిపారు. ఊహాగానాల మీద తనకు నమ్మకం లేదని, ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితి పూర్తిగా హైకమాండ్ కు తెలుసునని, తగిన సమయంలో కాంగ్రెస్ అధిష్టానం తగిన నిర్ణయం తీసుకుంటుందన్న పూర్తినమ్మకం తనకు ఉందని ఇక్బాల్ హుస్సేన్ వివరించారు. 2024 మేలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన తర్వాత సీఎం పదవికి సిద్దరామయ్య, శివకుమార్ మధ్య గట్టి పోటీ నెలకొంది. అధిష్టానం నచ్చచెప్పడంతో డికే శివకుమార్ డిప్యూటీ సీఎం పదవి చేపట్టారు. అప్పట్లోనే రొటేషన్ సిఎం ఫార్ములా అంటూ వార్తలు వచ్చాయి. అంటే రెండున్నర ఏళ్లపాటు సిద్దరామయ్య, మరో రెండున్నర సంవత్సరాల పాటు డికే శివకుమార్ ముఖ్యమంత్రిపదవిలో కొనసాగుతారనే ప్రచారం సాగింది. అయితే,దీనిని అధికారికంగా పార్టీ నాయకత్వం ధ్రువీకరించలేదు. ముఖ్యమంత్రి మార్పు వార్తలను కేవలం ఊహాగానాలుగా సిఎం సిద్దరామయ్య కుమారుడు ఎమ్మెల్సీ యతీంద్ర సిద్దరామయ్య తోసి పుచ్చారు. 2023లో కాంగ్రెస్ హైకమాండ్ సిద్దరామయ్యను సీఎంగా ఎంపిక చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

# జవహర్‌నగర్‌లో పేదల ఇళ్ల కూల్చివేత: ప్రభుత్వంపై ఈటల రాజేందర్ ఫైర్








**జవహర్‌నగర్, తెలంగాణ షాన్ జూన్ 30:** జవహర్‌నగర్‌లో రెవెన్యూ అధికారులు పేదల ఇళ్లను అన్యాయంగా కూల్చివేయడాన్ని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రంగా ఖండించారు. సోమవారం జవహర్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన భారీ ధర్నాలో పాల్గొన్న ఈటల, తెలంగాణ ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోకపోతే, పేదల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

**'ఇది రాజ్యాంగ విరుద్ధమైన చర్య' – ఈటల రాజేందర్**

"ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమైన చర్య. ప్రజల ఇళ్లను కూల్చి వారిని రోడ్డున పడేసే హక్కు ఎవరికీ లేదు," అని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. రెవెన్యూ అధికారులు పేదల పాత ఇళ్లను "అక్రమ నిర్మాణాలు"గా ముద్ర వేసి, ఎటువంటి విచారణ లేకుండానే బుల్డోజర్లతో కూల్చివేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. జవహర్‌నగర్ ప్రజలకు రాజ్యాంగ హక్కులు వర్తింపజేయాలని, లంచాలకు పాల్పడుతున్న అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**బీజేపీ డిమాండ్లు: ప్రజా సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం**

**ఈ సందర్భంగా బీజేపీ ప్రభుత్వం ముందు కీలక డిమాండ్లను ఉంచింది:**

– రాజ్యాంగ హక్కుల అమలు: జవహర్‌నగర్ ప్రజలు ఓటు వేస్తున్నా, పన్నులు చెల్లిస్తున్నా వారికి రాజ్యాంగ హక్కులు ఎందుకు వర్తించడం లేదని బీజేపీ ప్రశ్నించింది.

– అవినీతి రహిత సేవలు: ఇంటి పన్నులో యజమాని పేరు మార్పు వంటి సాధారణ విషయాల్లో సైతం అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించినా, లంచాలు ఇవ్వని వారికి సేవలను నిరాకరించడం దారుణమని బీజేపీ తప్పుబట్టింది. పారదర్శకమైన డిజిటల్ ప్రక్రియను అమలు చేయాలని డిమాండ్ చేసింది.

– భూముల వివాదం: తరతరాలుగా పూర్వీకులు కష్టపడి సంపాదించిన భూములను ఇప్పుడు రెవెన్యూ శాఖ అక్రమంగా ప్రకటించడాన్ని, ఎటువంటి విచారణ లేకుండానే భూస్వాములకు నష్టం కలిగించే చర్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది.

– మౌలిక వసతుల లేమి: జవహర్‌నగర్‌లో 3 లక్షల జనాభా ఉన్నప్పటికీ, కనీసం ఒక్క పార్క్ లేదా క్రీడా మైదానం కూడా లేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని బీజేపీ అభిప్రాయపడింది. కనీసం అంబులెన్స్‌లు కూడా రావడం లేదని, పాఠశాల పిల్లలు, వికలాంగులు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

– ఇళ్ల కూల్చివేతపై విచారణ: 30 ఏళ్ల పురాతనమైన పక్కా ఇళ్లను అక్రమంగా వర్గీకరించి కూల్చివేయడం అన్యాయమని, దీనిపై ఉన్నత స్థాయి కమిటీతో సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ డిమాండ్ చేసింది.

– పేదల ఇళ్లకు పట్టాలు: సంవత్సరాలుగా నివసిస్తున్న పేదల ఇళ్లకు ఇప్పటికీ పట్టాలు ఇవ్వకపోవడంపై, ఎన్నికల హామీలను ప్రభుత్వం అమలు చేయకపోవడాన్ని బీజేపీ తప్పుబట్టింది.

– వ్యవస్థాపరమైన అవినీతి: "ఫైళ్లు కదలాలంటే లంచాలే మార్గమవుతున్నాయి. వ్యవస్థాపరమైన అవినీతి పరాకాష్టకు చేరుకుంది," అని ఈటల మండిపడ్డారు.

– అధికారుల వేధింపులు: ప్రతి చిన్న పని కోసం భారీ మొత్తాలను డిమాండ్ చేస్తూ ప్రజలను వేధిస్తున్న అధికారుల తీరుపై సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ కోరింది.

– డంపింగ్ యార్డ్ సమస్య: వేలాది మంది చెత్త దుర్వాసనతో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నా, ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని, వెంటనే డంపింగ్ యార్డ్ వల్ల ఏర్పడుతున్న మహమ్మారిని అరికట్టాలని ఈటల అన్నారు.

– మిషన్ భగీరథ నీటి సరఫరా: ప్రతి కుటుంబానికి ఉచితంగా తాగునీరు అందించాలని, పేదల నుండి ప్రైవేట్‌గా 250 నుండి వెయ్యి రూపాయల వరకు వసూలు చేయడం సరికాదని బీజేపీ స్పష్టం చేసింది.

**న్యాయపోరాటానికి సిద్ధం: ఈటల రాజేందర్ శపథం**

జవహర్‌నగర్‌లో అధికారుల అనాలోచిత ప్రవర్తన పేద ప్రజలను అంధకారంలోకి నెట్టివేస్తోందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజల సమస్యలను పరిష్కరించకపోతే, బీజేపీ న్యాయపోరాటాన్ని తీవ్రంగా ప్రారంభిస్తుందని, ప్రజల హక్కుల కోసం తాము ఎటువంటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. శ్రీ లక్ష్మీనరసింహ కాలనీ అధ్యక్షుడు కేకే చారి వివరించిన కాలనీ సమస్యలు , ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన పోరు బాట కార్యక్రమంలో రోడ్డు సమస్య ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది. ప్రభుత్వ స్థలం అని చెబుతున్నా, ఒక ప్రైవేటు వ్యక్తి దానిని అడ్డుకున్నారని అధ్యక్షుడు కేకే చారి వివరించారు. అలాగే, రోడ్డు లేకపోవడం వల్ల కనీసం అంబులెన్స్‌లు కూడా రావడం లేదని, వికలాంగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పాఠశాల పిల్లలు కూడా స్కూల్‌కి వెళ్లాలంటే చాలా కష్టపడుతున్నారని కేకే చారి తెలిపారు.

---

తెలంగాణ షాన్

## సంపాదకీయం

### విదేశీ విశ్వవిద్యాలయాలతో విద్యకు ముప్పు...?

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఐదు విశ్వవిద్యాలయాలు జాతీయ విద్యావిధానం 2020కి అనుగుణంగా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనలు 2023 ప్రకారం భారతదేశంలో క్యాంపస్‌లను స్థాపించడానికి సిద్ధమవుతున్నందున, భారతీయ ఉన్నత విద్యలో పరివర్తనాత్మక మార్పు జరుగుతోంది. ఇల్లినాయిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, యూనివర్సిటీ ఆఫ్ లివర్‌పూల్, విక్టోరియా యూనివర్సిటీ, వెస్ట్రన్ సిడ్నీ యూనివర్సిటీ, ఇన్‌స్టిట్యూట్ యూరోపియో డి డిజైన్ (ఇటలీ) 2026- 2027 మధ్య కార్యకలాపాలను ప్రారంభించనున్నారు.యుజిసి ఆమోదం పొందిన మొదటి విదేశీ విశ్వవిద్యాలయంగా 2025 ఆగస్టులో గురుగ్రామ్ క్యాంపస్‌ను ప్రారంభించనున్నది సౌతాంప్టన్ విశ్వవిద్యాలయం. ఈ విదేశీ క్యాంపస్‌లు భారతదేశ విద్యారంగాన్ని మెరుగుపరుస్తాయా లేదా దాని ఉన్నత విద్యా వ్యవస్థకు ముప్పు కలిగిస్తాయా అని మేధావుల్లో చర్చకు దారితీసింది. భారతీయ విద్యార్థులకు విదేశీ విశ్వవిద్యాలయాల రాక గణనీయమైన ప్రయోజనాలను హామీ ఇస్తున్నది. అగ్రశ్రేణి సంస్థలు అధిక -నాణ్యతగల పాఠ్యాంశాలు, ప్రపంచ బోధనా పద్ధతులు, పరిశోధన అవకాశాలను అందించగలవు. భారత దేశంలో ప్రపంచస్థాయి ఉన్నతవిద్యాసంస్థల కొరతను పరిష్కరిస్తాయి. ప్రస్తుతం ఐఐటిలు, ఐఐఎంలు వంటి ఉన్నత సంస్థలు మాత్రమే ప్రపంచవ్యాప్తంగా పోటీపడుతున్నాయి. విద్యార్థులు విదేశాలలో చదువుకోవడం కంటే తక్కువ ఖర్చుతో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన డిగ్రీలను పొందగలుగుతారు. ఆర్థిక భారాన్ని తగ్గిస్తారు, 2022లో 6,50,000 మంది భారతీయ విద్యార్థులు విదేశాలలో చదువుతున్నందున రూ. 1.3 లక్షల కోట్ల వార్షిక ప్రవాహాన్ని నివారిస్తారు. ఈ క్యాంపస్‌లు 2022లో దాదాపు 1 మిలియన్ భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదువుతున్నందున మేధోవలస కూడా అరికట్టగలవు. 2024 నాటికి 80 బిలియన్ల డాలర్లకు చేరుకుంటాయని అంచనా వేయబడిన ఆర్థిక వనరులను నిలుపుకోగలవు. ఐఐటి ఢిల్లీ క్వీన్స్‌ల్యాండ్ విశ్వవిద్యాలయంతో భాగస్వామ్యం వంటి సహకార కార్యక్రమాలు ఆవిష్కరణను ప్రోత్సహిస్తాయని భావిస్తున్నారు. గుజరాత్‌లోని జిఐఎఫ్‌టి సిటీ వంటి కేంద్రాలు పన్ను మినహాయింపులు అందిస్తూ డీకిన్ విశ్వవిద్యాలయం వంటి సంస్థలు ఆకర్షిస్తున్నాయి. అంతేకాకుండా, విదేశీ విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయ అధ్యాపకులు, పరిశ్రమ- సమలేఖన కార్యక్రమాలను అందించడం ద్వారా, ప్రపంచ మార్కెట్లకు విద్యార్థులను సిద్ధం చేయడం ద్వారా ఉపాధిని పెంచుతాయి. ఇంటి నుండి బయటకు వెళ్లకుండా ప్రపంచస్థాయి విద్యను కోరుకునే భారతీయ విద్యార్థులకు ఇది గేమ్- ఛేంజర్. భారత దేశంలో ప్రపంచస్థాయి ఉన్నతవిద్యాసంస్థల కొరతను పరిష్కరిస్తాయి. ప్రస్తుతం ఐఐటిలు, ఐఐఎంలు వంటి ఉన్నత సంస్థలు మాత్రమే ప్రపంచవ్యాప్తంగా పోటీపడుతున్నాయి. విద్యార్థులు విదేశాలలో చదువుకోవడం కంటే తక్కువ ఖర్చుతో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన డిగ్రీలను పొందగలుగుతారు. ఆర్థిక భారాన్ని తగ్గిస్తారు, 2022లో 6,50,000 మంది భారతీయ విద్యార్థులు విదేశాలలో చదువుతున్నందున రూ. 1.3 లక్షల కోట్ల వార్షిక ప్రవాహాన్ని నివారిస్తారు. ఈ క్యాంపస్‌లు 2022లో దాదాపు 1 మిలియన్ భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదువుతున్నందున మేధోవలస కూడా అరికట్టగలవు. 2024 నాటికి 80 బిలియన్ల డాలర్లకు చేరుకుంటాయని అంచనా వేయబడిన ఆర్థిక వనరులను నిలుపుకోగలవు. ఐఐటి ఢిల్లీ క్వీన్స్‌ల్యాండ్ విశ్వవిద్యాలయంతో భాగస్వామ్యం వంటి సహకార కార్యక్రమాలు ఆవిష్కరణను ప్రోత్సహిస్తాయని భావిస్తున్నారు. అయితే, విద్య పరిరక్షణ నేతలు, విమర్శకులు సంభావ్య ప్రమాదాల గురించి హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు రూ. 10,000, రూ. 50,000తో పోలిస్తే సంవత్సరానికి రూ. 10 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు అంచనా వేయబడిన అధిక ట్యూషన్ ఫీజులు సంపన్న విద్యార్థులకు ప్రాప్యతను పరిమితం చేస్తాయి, ప్రాథమిక, ఉన్నత విద్యను పొందేందుకు చాలా మంది కష్టపడుతున్న దేశంలో అసమానతలను తీవ్రతరం చేస్తాయి. స్కాలర్ షిప్‌లు లేదా నిశ్చయాత్మక చర్యలు లేకుండా వరుసగా 25.9%, 21.2% నమోదు రేట్లు కలిగిన షెడ్యూల్డ్ కులాలు, తెగలు వంటి అట్టడుగు వర్గాలు ఉన్నత విద్యకు దూరమవుతారు. భారతదేశంలోని విదేశీ క్యాంపస్‌లు దేశీయంగా ప్రతిభను, అలాగే వనరులను నిలుపుకునే సామర్థ్యాన్ని నొక్కి చెబుతున్నాయి. అయితే, భారతదేశంలో 40 మిలియన్ల ఉన్నత విద్య విద్యార్థులు కొంత భాగాన్ని మాత్రమే అందించే వాటి పరిమితి స్థాయి వాటి ప్రభావాన్ని పరిమితం చేయవచ్చు. భారతదేశంలో విదేశీ విశ్వవిద్యాలయాల విజయం వ్యూహాత్మక నియంత్రణపై ఆధారపడి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. నష్టాలను తగ్గించడానికి, ప్రభుత్వం అవసరాల ఆధారిత స్కాలర్‌షిప్‌లను అమలు చేయాలి. పెరిగిన నిధులతో ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేయాలి. ఉన్నత స్థాయి విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. విద్యా అంతరాలను పరిష్కరించడం కూడా చాలా కీలకం. విదేశీ విశ్వవిద్యాలయాల ప్రవేశం అంతర్గతంగా ముప్పు కాదు కానీ జాగ్రత్తగా పర్యవేక్షణ అవసరం.

---

## తిరుమలలో ప్రధానమంత్రి ఈ-బస్ సేవా

**తిరుమల :** తిరుమల శ్రీనివాసుడని రోజుకు వేల మంది దర్శించుకుంటారు. ఇలా వస్తున్న వాళ్ల సంఖ్య పెరుగుతోంది. అయితే ఇలా భారీగా భక్తులు తరలి వస్తున్న టైంలో వివిధ ప్రమాదాలు జరుగుతున్నాయి. తొక్కిసలాట, రోడ్డు ప్రమాదాలు, జంతువుల దాడి, అనారోగ్య కారణాలు ఇలా చాలా ఘటనలు జరుగుతున్నాయి. ఇలాంటి సమయాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. ఇకపై తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే వారికి బీమా సౌకర్యం కల్పించాలని టీటీడీ ప్రయత్నిస్తోంది. తిరుమలేశుడి దర్శనం కోసం రోజుకు 70వేల నుంచి లక్ష మంది వరకు భక్తులు వస్తుంటారు. వీరి సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానం చాలా సౌకర్యాలు కల్పిస్తుంది. కొండపైకి చేరినప్పటి నుంచి మళ్లీ దర్శనం చేసుకొని తిరిగి వెళ్లే వరకు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతోంది. ఎన్ని చర్యలు చేపట్టినప్పటికీ కొన్నింటిని నియంత్రించలేని పరిస్థితి నెలకొని ఉంటుంది. అందుకే అలాంటి దుర్ఘటనలు జరిగి భక్తులు మరణిస్తే వారికి మూడు లక్షల వరకు పరిహారం ఇస్తున్నారు. దీనికి బదులు మరిన్ని సౌకర్యాలతో బీమా ఫెసిలిటీ కల్పిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తోంది టీటీడీ. అలిపిరిలో భక్తులు మొదలైనప్పటి నుంచి స్వామిని దర్శించుకొని మళ్లీ తిరిగి అలిపిరి చేరుకునే వరకు బీమా వెసులుబాటు కల్పించాలని చూస్తోంది టీటీడీ. టికెట్లు తీసుకున్నప్పుడే ఈ బీమా ఆయా భక్తుల పేరున వచ్చేలా ప్రయత్నాలు చేస్తోంది. సర్వదర్శనం టికెట్లు తీసుకున్న వారిని ఏం చేయాలనే ఆలోచన చేస్తోంది. దీనిపై బీమా సంస్థలతో మాట్లాడుతున్నట్టు సమాచారం. మోరవైపు తిరుమలను పూర్తిగా కాలుష్యరహితంగా మార్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇకపై పూర్తిగా ఈవీలనే నడపాలని నిర్ణయించారు.

---

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శాంతియుత దీక్ష

### - (మద్దతు తెలిపిన ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ సోమశేఖర్ రెడ్డి)

**కాప్రా జూన్ 30:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశానుసారం రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి తాడూరి గగన్ కుమార్ ఆధ్వర్యంలో. కాంగ్రెస్ పార్టీ మొన్నటి ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన ఉద్యమకారుల అంశం, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఇందుకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత దీక్షలకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం శ్రీకారం చుట్టడం జరిగింది, ఇందులో భాగంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈరోజు ఉప్పల్ నియోజకవర్గం, మేడ్చల్ జిల్లా పరిధిలోని ఉద్యమకారుల ఐక్యతే బలంగా ఈసీఐఎల్ చౌరస్తాలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ప్రాంగణం వద్ద ప్రభుత్వానికి విన్నప ధోరణితో.. శాంతియుత దీక్షకు శ్రీకారం చుట్టగా ఇట్టి దీక్షకు సంఘీభావ మద్దతుగా ఉప్పల్ నియోజకవర్గ గౌరవ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి హాజరై దీక్షలో పాల్గొన్నారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యమకాలకు ఇచ్చిన హామీలు 250 గజాలు ఇంటి స్థలం, 25 వేల పెన్షన్, ప్రతి ఉద్యమకారునికి గుర్తింపు కార్డు, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలలో 20% కోట, అలాగే ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారులి నేటి కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, నాటి జెఏసి ఉప్పల్



నియోజకవర్గం చైర్మన్ మరియు డి.ఎస్.ఎస్ నేషనల్ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, టిఆర్ఎస్ పార్టీ నాయకులు లక్ష్మీనారాయణ,రహీం, మహేష్ గౌడ్, మనెమ్మ, కుమారస్వామి, సప్పిడి శ్రీనివాస్, కనకయ్యలి బిజెపి నాయకులు సీతారాంరెడ్డి మంజుల మద్దతు తెలుపుతూ నిలిచారు దీక్షలో కూర్చున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు దయానంద్, జానకి రెడ్డి, అనంతలక్ష్మి, జగన్ యాదవ్, జంగా సుదర్శన్, దొమ్మటి కిరణ్ కుమార్, భాను ప్రకాష్, శివకుమార్ నేత, రాంచందర్, రాజేందర్, ప్రభాకర్, ప్రసాద్, గణేష్, సందీప్ మహేశ్వరి, విజయ, ఉష, యాదలక్ష్మి యాదమ్మ మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు

# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వారి నిర్లక్ష్యం

## - (పరీక్ష రాసే విద్యార్థులకు తీవ్ర ఇక్కట్లు)




**సికింద్రాబాద్: జూన్ 30:** అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వారి నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గవర్నమెంట్ సంబంధించి గవర్నమెంట్ కాలేజీలు ఎన్నో ఉన్న సీతాఫల్ మండి లోని శ్రీ సాయి విద్యా వికాస్ జూనియర్ డిగ్రీ ప్రైవేట్ కాలేజీలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కి చెందిన పరీక్ష సెంటర్ వేయడం వల్ల అక్కడ ఎగ్జామ్స్ రాసే అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 40 సంవత్సరాలు దాటిన వారు కూడా ఉన్నారు .సరైన సౌకర్యాలు లేక ఒక ఫ్లోర్లో ఒకటే బాత్రూం ఉండడంతో ఆడవారు క్యూ లైన్ లో నిలబడి టాయిలెట్స్ కు వెళ్లడం జరుగుతుంది.ఓకే బాత్రూంలో ఆడవారు,మగవారు వెళ్లే పరిస్థితి ఉండడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. బాత్రూంలో కూడా శుభ్రంగా లేకపోవడంతో కంపు వాసనతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పరీక్ష రాస్తున్న పక్క రూములకు వాసన రావడంతో ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. క్లాస్ రూమ్ చిన్న చిన్న కుర్చీలు ఇరుకుగా ఉండడం చిన్న పిల్లలు కూర్చునే కుర్చీలు ఉండడంవల్ల ..కాస్త పెద్ద వయసు వారు, హైట్, పర్సనాలిటీ ఉన్నవారు కూర్చుంనే ముందు కాలు తగలడం వెనక వారికి వీపులు తగలడం లాంటి పరిస్థితి ఏర్పడ్డది.

ఏ రూములోనైన లైటింగ్ సరిగ్గ లేవు ,ఫ్యాన్లు సరిగ్గా ఉండవు ఏదో ఒక ఫ్యాన్ పని చేస్తే ఫుల్ గా తిరిగి పేపర్ ఎగిరి పడే పరిస్థితి 40 సంవత్సరాలకు పైబడిన వారు కూడా ఎగ్జామ్స్ రాయడానికి రావడంతో లైట్ ప్రాబ్లం వలన సరిగ్గా కనబడని పరిస్థిత ఉంది.కొందరికి షుగర్ బీపీ ఉండడంతో మళ్లీ మళ్లీ టాయిలెట్ కి వెళ్లే పరిస్థితి రావడం అక్కడ సరైన సౌకర్యాలు లేకపోవడం ఇరుక్కు గదులు మెయిన్ రోడ్డు పై బిల్డింగ్ ఉండడంతో ట్రాఫిక్ వలన శబ్దం గాలి వస్తే కిటికీ రెక్కలు పెద్ద సౌండ్ తో కొట్టుకోవడం ఇలా పార్కింగ్ ప్రాబ్లం రకరకాల ఇబ్బందులలో ఉన్నటువంటి కాలేజీలో సెంటర్ వేయడం అది ఎవరినీ ఉద్ధరించే ప్రయత్నము ఈ యూనివర్సిటీ వాళ్ళు ఆ కాలేజీలో సరైన సౌకర్యాలు ఉన్నాయో లేదో చూశారా లేదా? అక్కడ టీచర్స్ కూడా సరైన అవగాహన లేనట్లుంది ప్రశ్న పత్రాలు వేరే వేరేవి ఇచ్చి ఇబ్బందులు పాలు చేస్తున్నారు.. రోజు ఏదో ఒక రూముల టీచర్స్ తో ఎవరో ఒకరు గొడవ పడుతూనే ఉన్నారు ఇకనైనా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వాళ్ళు ఇలాంటి పరిస్థితి మళ్లీ రాకుండా చూడాలని విద్యార్థుల కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామన్నారు.

# ఏకగ్రీవం కోసం కసరత్తు...

**హైదరాబాద్ :** తెలంగాణలో బీజేపీ అధ్యక్ష పదవి కోసం ఉత్కంఠ రేపుతున్న పోటీ, ఢిల్లీ నేతల సమన్వయం, సామాజిక సమీకరణాలతో కూడిన ఎన్నిక ప్రక్రియ హాట్ టాపిక్‌గా మారింది. పార్టీ కేంద్రంలో అధికారంలో ఉండటం, రాష్ట్రంలో పెరుగుతున్న రాజకీయ ప్రాధాన్యంతో అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ కీలకంగా మారింది.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బీజేపీ అధ్యక్ష ఎన్నికలకు ఒకేసారి నోటిఫికేషన్ జారీ అయింది. నామినేషన్ ప్రక్రియ సోమవారం మధ్యాహ్నం వరకు కొనసాగనుంది. ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు వస్తే, మంగళవారం ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. ఈ ఎన్నికల పరిశీలకురాలిగా కర్ణాటకకు చెందిన శోభ కరంద్లాజే నియమితులయ్యారు. ఈ ప్రక్రియలో ఢిల్లీ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తూ, ఏకగ్రీవ ఎన్నికకు ప్రాధాన్యం ఇస్తోంది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ విషయాన్ని స్పష్టం చేస్తూ, ఏకగ్రీవ ఎన్నికే లక్ష్యమని వ్యాఖ్యానించారుతెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి కోసం పలువురు సీనియర్ నేతలు పోటీలో ఉన్నారు. రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్లు ముందున్నాయి. అయితే, ఢిల్లీ సమాచారం ప్రకారం, ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్‌లో ఒకరికి అధ్యక్ష పదవి దక్కే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది. ఈ ఇద్దరూ తమ సొంత సామాజిక సమీకరణాలు, రాజకీయ అనుభవంతో పార్టీలో బలమైన స్థానం కలిగి ఉన్నారు.ధర్మపురి అర్వింద్: నిజామాబాద్ ఎంపీగా బలమైన స్థానిక పట్టు, యువ నాయకత్వం, దూకుడైన రాజకీయ శైలి ఆయన సానుకూల అంశాలు.ఈటల రాజేందర్: మల్కాజ్‌గిరి ఎంపీగా, గతంలో టీఆర్ఎస్‌లో కీలక నేతగా ఉన్న అనుభవం, సమన్వయ నైపుణ్యం ఆయన బలం.బీజేపీ అధ్యక్ష ఎన్నికలో సామాజిక సమీకరణాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, రెడ్డి, కమ్మ వంటి సామాజిక వర్గాల సమతుల్యతను పరిగణనలోకి తీసుకుంటూ నిర్ణయం తీసుకోవాలని ఢిల్లీ నేతలు భావిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. రాష్ట్రంలో



కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో పోటీ పడేందుకు అనుకూలమైన నాయకత్వం అవసరమని పార్టీ అధిష్టానం భావిస్తోంది. ఒకవైపు బండి సంజయ్ పేరు కూడా గట్టిగా వినిపించినప్పటికీ, ఢిల్లీ నేతలు ఈ విషయంలో గుంభనంగా ఉన్నారు. పార్టీలో ఐక్యత, సమన్వయం, రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు, భవిష్యత్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకుంటున్నారు.బీజేపీ అధిష్టానం ఏకగ్రీవ ఎన్నికకు ప్రాధాన్యం ఇస్తోంది. నామినేషన్ ప్రక్రియలోనే ఢిల్లీ నేతలు కీలక మంత్రాంగం సాగిస్తున్నారు. అధ్యక్ష పదవి కోసం పోటీలో ఉన్న నేతలు చివరి నిమిషంలో తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. జులై 1న కొత్త అధ్యక్షుడి పేరు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈ నిర్ణయం పార్టీలో ఐక్యతను, రాష్ట్రంలో రాజకీయ బలాన్ని పెంచే దిశగా ఉంటుందని భావిస్తున్నారు.తెలంగాణలో బీజేపీ బలోపేతం కావాలంటే, సమన్వయ నైపుణ్యం, స్థానిక రాజకీయ డైనమిక్స్‌ను అర్థం చేసుకునే నాయకత్వం కీలకం. ధర్మపురి అర్వింద్ యువ శక్తిని, దూకుడును తెస్తే, ఈటల రాజేందర్ అనుభవం, సమన్వయ నైపుణ్యంతో పార్టీని ఏకతాటిపై నడిపే అవకాశం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయడానికి అధ్యక్షుడి పాత్ర కీలకం. ఢిల్లీ నేతలు ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు.

# 8 గంటల ముందే రైల్వే చార్ట్



**న్యూఢిల్లీ :** రైలు ప్రయాణీకులకు మరింత సౌకర్యవంతంగా ఉండేందుకు భారతీయ రైల్వే శాఖ కీలక మార్పులు తీసుకురానుంది. రైలు బయలుదేరడానికి 8 గంటల ముందే చార్ట్‌ను సిద్ధం చేసేలా కొత్త సంస్కరణలు తీసుకురానుంది. అంతేకాకుండా అధునాతన రిజర్వేషన్ వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టనుంది. వీటి వల్ల వెయిట్‌లిస్ట్ టికెట్లు ఉన్న ప్రయాణికులకు తమ టికెట్ స్టేటస్ గురించి ముందుగానే స్పష్టత వస్తుంది. తత్కాల్ టికెట్లకు ఆధార్ తప్పనిసరి చేస్తూ, టికెట్ బుకింగ్‌లో అక్రమాలను అరికట్టడానికి కూడా రైల్వే శాఖ చర్యలు తీసుకుంటోంది.రైలు ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడానికి, ప్రయాణికులకు అనవసరమైన ఆందోళనను తగ్గించడానికి భారతీయ రైల్వే శాఖ కీలక సంస్కరణలను అమలు చేయనుంది. ఇందులో భాగంగా రైలు బయలుదేరడానికి 8 గంటల ముందే ప్రయాణికుల చార్ట్‌ను సిద్ధం చేయాలని రైల్వే బోర్డు ప్రతిపాదించింది. ఈ మార్పులు అమలులోకి వస్తే, వెయిట్‌లిస్ట్ టికెట్లు ఉన్న ప్రయాణికులకు తమ టికెట్ స్టేటస్ గురించి ముందుగానే స్పష్టత లభిస్తుంది.కొత్త ప్రతిపాదనలు అమలైతే.. మధ్యాహ్నం 2 గంటల లోపు బయలుదేరే రైళ్ల కోసం చార్టును అంతకుముందు రోజు రాత్రి 9 గంటలకే తయారు చేస్తారు. దీంతో రిజర్వేషన్ కన్ఫర్మ్ కాని ప్రయాణికులు ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవడానికి, లేదా స్టేషన్‌కు వెళ్లాలా వద్దా అని నిర్ణయించుకోవడానికి తగినంత సమయం దొరుకుతుంది. ప్రస్తుతం రైలు బయలుదేరడానికి కేవలం 4 గంటల ముందు మాత్రమే చార్ట్ సిద్ధం చేస్తున్నారు. ఈ కొత్త పద్ధతి వల్ల మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు, శివారు ప్రాంతాల నుంచి స్టేషన్లకు చేరుకోవాల్సిన వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని రైల్వే బోర్డు పేర్కొంది.ముందస్తు చార్టుల తయారీతో పాటు, రైల్వేశాఖ అధునాతన ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ ను 2025 డిసెంబర్ నాటికి అందుబాటులోకి తీసుకురావాలని కృషి చేస్తోంది. ఈ ప్రాజెక్టును సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ సంస్థ అమలు చేయనుంది. ఈ నూతన వ్యవస్థ అమలులోకి వస్తే ఈ కింది ప్రయోజనాలు చేకూరుతాయి.వేగవంతమైన బుకింగ్: ప్రస్తుతం నిమిషానికి 32,000 టికెట్లు బుక్ చేయగలిగే సామర్థ్యం ఉంది. కొత్త వ్యవస్థతో నిమిషానికి 1.5 లక్షలకు పైగా టికెట్లు బుక్ చేసేలా ఐదు రెట్లు పెరుగుతుంది. ఇక ఇది కొత్త వ్యవస్థ అమలైతే టికెట్ ఎంక్వైరీ సామర్థ్యం నిమిషానికి 4 లక్షల నుంచి 40 లక్షలకు పైగా పెరగనుంది. దీంతో లక్షలాది మంది ప్రయాణికులకు రియల్-టైమ్ బుకింగ్ సమాచారం అందుబాటులోకి వస్తుంది.ఇదిలా ఉండగా.. ఈ ప్రతిపాదనకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఆమోదం తెలిపారని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా దశలవారీగా దీన్ని అమలు చేయాలని ఆదేశించినట్లు రైల్వే బోర్డు తెలిపింది. అయితే, ట్రైన్ బయలుదేరే 5 గంటల ముందు కూడా బుక్ చేసుకునే వారు ఉంటారు. అలాంటి వారికి మాత్రం ఇది బ్యాడ్ న్యూస్ అనే చెప్పాలి.మరో ముఖ్యమైన మార్పులో భాగంగా 1 జులై 2025 నుంచి ఆధార్ అథెంటికేషన్ పూర్తి చేసుకున్న వారికి మాత్రమే తత్కాల్ టికెట్లు బుక్ చేసుకునే అవకాశం లభిస్తుంది. టికెట్ల బుకింగ్‌లో జరిగే అక్రమాలను అరికట్టడమే ఈ నిబంధన ప్రధాన ఉద్దేశ్యం. అంతేకాకుండా, జులై నెలాఖరు నుంచి టికెట్ బుకింగ్ సమయంలో ఆధార్ ఓటీపీని కూడా ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఈ చర్యలన్నీ రైల్వే సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చడంలో దోహదపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# బెంగాల్ లో బరో అఘాయిత్యం

**కోల్ కత్తా :** శ్చిమ బెంగాల్‌లో మహిళల భద్రతపై మరోమారు ఆందోళన వ్యక్తమవుతోంది. కోల్‌కతాలోని ఆర్జీకర్ వైద్య కళాశాల విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటన మరువకముందే, తాజాగా ఒక న్యాయ కళాశాల ప్రాంగణంలోనే 24 ఏళ్ల విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిన ఘటన కలకలం రేపుతోంది. ఈ ఘటనలో ప్రధాన నిందితుడికి అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు రాజకీయ దుమారాన్ని రేకెత్తిస్తున్నాయి.కోల్‌కతాలోని ఒక న్యాయ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిపై అదే కళాశాలకు చెందిన ఇద్దరు సీనియర్లు, ఒక పూర్వ విద్యార్థి కలిసి క్యాంపస్‌లోనే ఈ దారుణానికి పాల్పడ్డారు. బాధితురాలిపై సామూహిక అత్యాచారం జరిగినట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయిందని ఒక సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి గురువారం ఇద్దరిని, శుక్రవారం ప్రధాన నిందితుడైన మనోజిత్ మిశ్రా (31)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తనను వదిలేయమని వేడుకున్నా నిందితులు కనికరించలేదని, ఈ అఘాయిత్యాన్ని వీడియో తీసి అందరికీ పంపిస్తామని బెదిరించారని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. తాను తప్పించుకునేందుకు ప్రయత్నించగా హాకీ స్టిక్‌తో దాడి చేశారని ఆమె పోలీసులకు వివరించింది.ఈ ఘటనపై గతంలో హత్యాచారానికి గురైన ఆర్జీకర్ వైద్య విద్యార్థిని తండ్రి తీవ్రంగా స్పందించారు. టీఎంసీ ప్రభుత్వ ఉదాసీనత వల్లే రాష్ట్రంలో ఇలాంటి దారుణాలు పునరావృతమవుతున్నాయని ఆయన ఆరోపించారు. “నా కుమార్తె విషయంలో వేలాది మంది రోడ్లపైకి వచ్చి పోరాడారు. అయినా మహిళలపై అఘాయిత్యాలు ఆగడం లేదు. నా కుమార్తెలాంటి అభాగ్యులు ఇంకెంత మంది ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలి కావాలి? ఈ కేసులో నిందితులకు కఠిన శిక్ష పడినప్పుడే ఇటువంటివి ఆగుతాయి” అని ఆయన అన్నారు. నిందితులందరూ అధికార పార్టీకి చెందినవారేనని ఆయన ఆరోపించారు.ఈ ఘటనపై టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ చేసిన వ్యాఖ్యలు పెను దుమారానికి కారణమయ్యాయి. “విద్యార్థినిపై ఆమె స్నేహితులే అత్యాచారం చేస్తే ఎవరు మాత్రం ఏం చేయగలరు? పోలీసులు ప్రతి కళాశాలలో కాపలా ఉండాలా?” అంటూ ఆయన మీడియాపై విరుచుకుపడ్డారు. మహిళలు ప్రభుత్వాలపై కాకుండా, ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్న పురుషులకు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన వ్యాఖ్యానించారు. కల్యాణ్ బెనర్జీ వ్యాఖ్యలను ప్రతిపక్ష బీజేపీ నేతలు తీవ్రంగా ఖండిస్తూ ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి ఇది నిదర్శనమని మండిపడ్డారు.తృణమూల్ నేతలతో సంబంధాలు నిందితుల్లో ఒకరైన మనోజిత్ మిశ్రా.. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ, ఆరోగ్య మంత్రి చంద్రమ భట్టాచార్య వంటి టీఎంసీ కీలక నేతలతో కలిసి దిగిన ఫొటోలను బీజేపీ ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ, జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.మమతా బెనర్జీ పాలనలో బెంగాల్ మహిళలకు పీడకలగా మారిందని, మమత ప్రభుత్వం మరోసారి నిందితుల పక్షాన నిలబడిందని ప్రదీప్ భండారీ ఆగ్రహం వ్యక్తంచేశారు. మనోజిత్ మిశ్రా ఒక టీఎంసీ సభ్యుడని, ఆర్జీ కర్ అత్యాచారం కేసులో అయినా, ఈ కేసులో అయినా నిందితులను కాపాడటంలోనే టీఎంసీ ముందుంటోందని ఆరోపించారు. ఈ దారుణంపై ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని, ఎవరిని కాపాడాలని చూస్తోందని అమిత్ మాలవీయ ప్రశ్నించారు.రాజకీయం చేయొద్దు.. టీఎంసీ ఎదురుదాడిబీజేపీ ఆరోపణలపై టీఎంసీ నేత శశి పంజా తీవ్రంగా స్పందించారు. ఈ దారుణ ఘటనను రాజకీయం చేయవద్దని ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ “ఈ సంఘటన చాలా బాధాకరం. అయితే బీజేపీ నేతలు దీనిపై సానుభూతి చూపాల్సింది పోయి, నిందితుల మతం, పేర్లు చూస్తూ ఫొటోలు ప్రదర్శిస్తున్నారు” అని విమర్శించారు.ఫిర్యాదు అందిన 12 గంటల్లోనే పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారని, వారి ఫోన్లు స్వాధీనం చేసుకుని, బాధితురాలి వాంగ్మూలం నమోదు చేశారని శశి పంజా వివరించారు. కోల్‌కతా పోలీసులు స్పందించిన వేగాన్ని బీజేపీ ఊహించలేదని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి వేగవంతమైన చర్యలు కనిపించవని విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారిలో కాలేజీ మాజీ విద్యార్థి మనోజిత్ మిశ్రా (31), ప్రస్తుత విద్యార్థులు జైబ్ అహ్మద్ (19), ప్రమిత్ ముఖర్జీ (20) ఉన్నారు. నిందితులను అలీపూర్ కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారికి జులై 1 వరకు పోలీస్ కస్టడీ విధించింది. బాధితురాలి వైద్య నివేదికలో ఆమె శరీరంపై గాయాలు, గోటి గీతలు ఉన్నాయని, బలవంతపు లైంగిక దాడి జరిగినట్టు నిర్ధారణ అయిందని పోలీసులు తెలిపారు.కాగా, సుమారు 10 నెలల క్రితం జరిగిన ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థినిపై లైంగిక దాడి, హత్య ఘటనను ఈ ఉదంతం గుర్తుచేస్తోంది. ఆ కేసులో కూడా రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఆ ఘటనలో దోషిగా తేలిన సంజయ్ రాయ్ అనే సివిక్ వాలంటీర్‌కు కోర్టు జీవిత ఖైదు విధించిన విషయం తెలిసిందే.

# కారు పార్టీకి లైఫ్ అండ్ డెత్‌గా జూబ్లీహిల్స్ బైపోల్..

**హైదరాబాద్ :** అసలే సిట్టింగ్ సీటు. పైగా పార్టీ ఎమ్మెల్యే చనిపోయారన్న సానుభూతి. అన్నింటికన్నా మించి అధికార కాంగ్రెస్ అన్నింట్లో ఫెయిల్ అయిందని చెబుతున్నాం. ఇలాంటి సమయంలో వచ్చిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచి తీరుతామంటోంది బీఆర్ఎస్ పార్టీ. బైపోల్‌లో గెలిచి కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని..అధికారంలోకి రాబోయేది బీఆర్ఎస్సేనన్న సంకేతాన్ని ప్రజల్లోకి పంపించాలని భావిస్తోందట. ఈ ఉపఎన్నికను లైఫ్ అండ్ డెత్‌గా తీసుకుంటోందట కారు పార్టీ.రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు జూబ్లీహిల్స్ ఎన్నికలు సెమీఫైనల్‌గా ఫీల్ అవుతోందట. ఈ ఎన్నికలో గెలవకపోతే క్యాడర్, లీడర్లు ఇంకా చేజారిపోయే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారట. అందుకే ఏం చేసైనా..ఎలాగైనా సిట్టింగ్ సీటును నిలబెట్టుకుని క్యాడర్, లీడర్లతో పాటు..ప్రజల్లోనూ బీఆర్ఎస్ మళ్లీ రాబోతుందన్న నమ్మకం కలిగించాలని ఫిక్స్ అయిందట. అందుకోసం బైపోల్ స్ట్రాటజీపై పెద్ద కసరత్తే చేస్తున్నారట బీఆర్ఎస్ ముఖ్యనేతలు. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ సమన్వయ బాధ్యతలు ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, దాసోజు శ్రవణ్‌లకు అప్పగించారట. పైగా డివిజన్ల వారీగా మాగంటి గోపినాథ్ సంస్మరణ సభలను నిర్వహిస్తున్నారు.ఇక పబ్లిక్ పల్స్ తెలుసుకునేందుకు ఇప్పటికే జూబ్లీహిల్స్‌లో సర్వే చేయించిన బీఆర్ఎస్‌కు..పాజిటివ్ రిపోర్ట్ వచ్చిందంటున్నారు. మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతను బరిలోకి దింపితే..సానుభూతితో పాటు ప్రజల్లో బీఆర్ఎస్‌పై ఉన్న నమ్మకం, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి తమను గెలిపిస్తుందని భావిస్తున్నారట గులాబీ లీడర్లు. ప్రభుత్వ ఇంటెలిజెన్స్ సర్వే రిపోర్ట్ కూడా కారు పార్టీకే సానుకూలంగా ఉందంటున్నారు బీఆర్ఎస్ లీడర్లు.జూబ్లీహిల్స్ బైపోల్‌ను చాలా ప్రెస్టీజియస్‌గా తీసుకుంటున్నారట కారు పార్టీ నేతలు. ఇప్పటివరకు బీఆర్ఎస్ ఏ బైపోల్‌ను ఫేస్ చేసినా అయితే కేటీఆర్ లేకపోతే హరీశ్‌రావు ఇంచార్జ్‌గా ఉంటూ వచ్చారు. కానీ జూబ్లీహిల్స్‌కు వచ్చేసరికి కేటీఆర్, హరీశ్ ఇద్దరినీ రంగంలోకి దించాలని భావిస్తున్నారట గులాబీ బాస్. బోరబండ, రహ్మత్ నగర్, జూబ్లీహిల్స్ బస్తీల్లో హరీశ్‌రావుకు.. యూసుఫ్‌గూడ, జూబ్లీహిల్స్ క్లాస్ ఏరియాల్లో కేటీఆర్‌కు బాధ్యతలు అప్పగిస్తారని అంటున్నారు. ఈ ఇద్దరు నేతలతో అటు క్లాస్, ఇటు మాస్ పబ్లిక్‌ను అట్రాక్ట్ చేసి ఈ ఎన్నికల్లో గట్టెక్కాలని ప్లాన్ చేస్తున్నారట గులాబీ బాస్.గతంలో జరిగిన ఏ ఉప ఎన్నికలో కూడా కేటీఆర్, హరీశ్ ఒకే నియోజకవర్గంలో పని చేయలేదు. నారాయణ్‌ఖేడ్ మొదలు..కంటోన్మెంట్ వరకు..ఏ ఉపఎన్నిక అయినా అయితే కేటీఆర్ లేకపోతే హరీశ్‌రావుకు బాధ్యతలు ఇస్తూ వచ్చారు కేసీఆర్. ఫస్ట్ టైమ్ జూబ్లీహిల్స్ బైపోల్ బాధ్యతలను ఇద్దరు నేతలకు అప్పగించనున్నారట. సేమ్‌టైమ్ ఎక్కువ శాతం రోడ్ షోలు, డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేయాలని అనుకుంటున్నారట. ప్రతీ డివిజన్‌కు ఓ మాజీ మంత్రిని ఇంచార్జ్‌గా నియమించి..అవసరమైతే జిల్లాల నుంచి క్యాడర్, లీడర్లను తెప్పించి డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేయాలని స్కెచ్ వేస్తున్నారట.ప్రతీ వంద ఓటర్లకు ఓ అబ్జర్వర్‌ను పెట్టి..సాధ్యమైనంత ఎక్కువ మంది ఓటర్లను కలిసి భారీ మెజార్టీతో గెలిచే ప్లానే వేస్తోందట బీఆర్ఎస్ పార్టీ. గ్రేటర్‌లో తాము చేసిన అభివృద్ధి, కాంగ్రెస్ వచ్చాక తెచ్చిన హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో చేసిన నష్టాన్ని వివరించాలని పకడ్బందీ వ్యూహం రచిస్తోందట కారు పార్టీ. మరీ బీఆర్ఎస్ వ్యూహాలు ఎంత వరకు సక్సెస్ అవుతాయో.. బైపోల్‌లో గెలుపోటములు ఎలా ఉంటాయో చూడాలి

# వివాహేతర సంబంధం... వివస్త్రను చేసి దాడి

వరంగల్ : వివాహేతర సంబంధాలు ఇద్దరి జీవితాలను కాదు, కొన్ని కుటుంబాలను నాశనం చేస్తున్నాయి. కొన్ని సందర్భాలలో ప్రాణాలు సైతం తీస్తున్న ఘటనలు గత కొన్ని రోజులుగా పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో హనుమకొండ జిల్లాలో సభ్యసమాజం తలదించుకునే ఘటన జరిగింది. వివాహేతర సంబంధం పెట్టుకున్న కారణంగా ఓ మహిళను వివస్త్రను చేసి దాడి చేయడంతో పాటు ప్రైవేట్ భాగాల్లో జీడిపోసి హింసించారు.వివాహేతర సంబంధం పెట్టుకుందన్న కారణంతో వివాహిత పై దాడి చేసి వివస్త్రను చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామంలో ఐదు రోజుల క్రితం ఓ అమానవీయ ఘటన చోటుచేసుకుంది. తన భర్తతో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఓ వివాహితను ఆమె బంధువులు చెట్టుకు కట్టేసి కొట్టారు. అంతటితో ఆగకుండా ఆమె వివస్త్రను చేసి దాడి చేశారు. అయినా శాంతించని మహిళ బంధువులు జననాంగాల్లో జీడిపోసి చిత్రహింసలకు గురిచేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడి చేసిన వివరాలు సేకరిస్తున్నారు.తాటికాయల గ్రామానికి చెందిన ఓ యువతికి పదేళ్ల క్రితం ములుగు మండలం బోలోనిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. అతడికి సమీప బంధువైన ఓ వివాహితతో వివాహేతర సంబంధం పెట్టుకొని, కొన్నిరోజుల కిందట ఆ మహిళతో కలిసి వెళ్లిపోయారు. తన భర్త వేరే మహిళతో వెళ్లిన విషయాన్ని స్వగ్రామమైన తాటికాయలకు వచ్చి మహిళ తన తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో ఆ మహిళ తల్లిదండ్రులు, బంధువుల చుట్టుపక్కల గాలించారు. పారిపోయిన ఇద్దరిని వెతికి ఐదు రోజుల క్రితం తాటికాయల గ్రామానికి తీసుకొచ్చి వారిపై దాడి చేశారు. ఇలాంటి పనులు చేస్తే మా పరువు ఏమవుతుందని, కూతురి జీవితం నాశనం అవుతుందంటూ ఇద్దరిని కొట్టారు. తన భర్తతో వివాహేతర సంబందం పెట్టుకున్న మహిళపై దాడి చేసి ఏం మందు పెట్టావు అంటూ వివస్త్రను చేశారు. అనంతరం ఇద్దరికి గుండు గీయించారు. వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ వద్దని వేడుకుంటున్నా ఆమెను వివస్త్రను చేసి జననాంగాల్లో జీడి పోసి చిత్రహింసలు పెట్టారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ తరువాత నుంచి దాడికి గురైన ఇద్దరు ఆచూకీ లేదని సమాచారం.

తెలంగాణ షాన్
TELANGANA SHAAN
మంగళవారం, జూలై 1, 2025
Tuesday, July 1, 2025

## నెల్లూరు జిల్లాలో జంట హత్యలు

**నెల్లూరు :** నెల్లూరు జిల్లా దుత్తలూరు ఏసీ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి జంట హత్యలు కలకలం రేపింది. మద్యం మత్తులో భార్య వెంకాయమ్మపై కత్తితో భర్త వెంగయ్య విచక్షణా రహితంగా దాడి చేశారు. దాడిని అడ్డుకునేందుకు యత్నించిన అత్త జయమ్మ (60), మామ కల్లయ్య (65) లను కత్తితో నరకడంతో అక్కడికక్కడే మృతి చెందారు. భార్య పరిస్థితి విషమంగా ఉండడంతో ఉదయగిరి ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం

**విశాఖపట్నం :** బంగాళాఖాతం లో అల్పపీడనం ఏర్పడింది. ఇది రాబోయే రెండు రోజుల్లో ఉత్తర ఒడిశా, పశ్చిమబెంగాల్, జార్ఖండ్ వైపు ప్రయాణించే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. దక్షిణ రాజస్థాన్, ఉత్తర గుజరాత్ మీదుగా ఉన్న ఉపరితల ఆవ ర్తనం నుంచి బంగాళాఖాతంలో ఉన్న అల్పపీడనం వరకు ద్రోణి కొనసాగుతోం దని వివరించింది. వీటి ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. దక్షిణ కోస్తా, రాయలసీమల్లో వేడి, తేమ, అసౌకర్యవైన వాతావరణం నెలకొంటుందని పేర్కొంది. అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం ఆదివారం బలహీనపడింది. ఉత్తర అండమాన్ సముద్రంలో తాజాగా మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు ఐ ఎం డి తెలిపింది..

## భారీ వరదలు.. 20 మంది మృతి

**న్యూఢిల్లీ :** ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఒక్క హిమాచల్ ప్రదేశ్లోనే ఆకస్మిక వరదల ధాటికి పలు ఘటనల్లో ఇప్పటివరకు 20 మంది మరణించినట్లు మంత్రి జగత్ సింగ్ తెలిపారు. రూ.వందల కోట్ల నష్టం వాటిల్లినట్లు వెల్లడించారు. ఉత్తరాఖండ్లోని ఉత్తరకాశి జిల్లాలో యమునోత్రి జాతీయ రహదారిలోని సిలాయ్ బైండ్లో ఆదివారం కొండచరియలు విరిగిపడ్డాయి. అటు ఇరు రాష్ట్రాల్లోనూ రెడ్, ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతోంది.

## శ్రీశైలం జలాశయానికి భారీగా వరద ప్రవాహం

ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికిభారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టు ఇన్ ఫ్లో 1,56,554 క్యూసెక్కులు ఉంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 872.50 అడుగుల వద్ద నీటిమట్టం కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.7080 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 152.4941 టీఎంసీలుగా కొనసాగుతోంది.

## జూరాల ప్రాజెక్టుకు భారీ వరద.. 14 గేట్లు ఎత్తివేత

మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జూరాల ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రాజెక్టు నిండిపోవడంతో అధికారులు 14 గేట్లు ఎత్తి 1.58 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం నీటిమట్టం 317.490 మీటర్ల వద్ద ఉండగా, జలవిద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది

## వైకాపావి అసత్య ప్రచారాలు

**తిరుపతి :** వైసిపి నాయకులు మాపై అసత్య ప్రచారాలు చేస్తూ తమ ఉనికిని కాపాడుకోవాలని ప్రయత్నంలో అభాస పాలవుతున్నారని తిరుపతి నగర డిప్యూటీ మేయర్ మునికృష్ణ విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. తిరుపతిలో శుక్రవారం జరిగిన వైసిపి సభలో పెద్దిరామచంద్రారెడ్డి మరియు కరుణాకర్ రెడ్డి టిడిపి పార్టీ పై దుష్ప్రచారంశ్రీ చేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చ లేదంటూ టిడిపి పార్టీ పై ఆరోపణల చేశారని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు అమలులో ఉన్న వైసిపి నాయకులు గ్రహించలేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న మంత్రి పార్థసారథి



**విశాఖపట్నం :** గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధా, సహాయ కార్య నిర్వహణ అధికారులు ఆనందకుమార్, రమణమూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు నాదస్వర వేదమంత్రా ల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా మంత్రి స్వామివారి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. తదుపరి నాదస్వరలతో వేదమంత్రాల నడుమ బేడా మండపం ప్రదక్షిణ చేసి స్వామివారి అంతరాలయ దర్శనం చేసుకున్నారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం తీసుకున్నారు. ఆలయ సహాయ కార్య నిర్వహణ అధికారి ఆనంద్ కుమార్ మంత్రికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి, ప్రసాదం అందజేశారు.

# కడప నగర ఎన్నికలపై కాంగ్రెస్ శ్రేణులు సిద్ధమవ్వాలి

### -ఆర్ఎస్ఎస్ ముసుగు మళ్ళీ తొలగిపోయింది..

### -భారత మాజీ ప్రధాని, స్వర్గీయ పి.వి. నరసింహారావు 104 వ జయంతిని ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు -ఎన్.డి. విజయజ్యోతి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు

**బద్వేలు :** కడప నగరంలోని 50 వార్డులపై కాంగ్రెస్ పార్టీ విజయాన్ని సాధించి మేయర్ పదవిని కైవసం చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి పిలుపునిచ్చారు. శనివారం ఆమె కడపలోని ఇందిరాభవన్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న కడప నగర వార్డు సభ్యుల పదవీ కాలం 13-03-2026తో ముగియనున్నట్లు తెలిపారు. ఇంకా సుమారు తొమ్మిది నెలల సమయం మాత్రమే మిగిలి ఉంది కనుక కాంగ్రెస్ పార్టీ నేతలంతా ఇప్పటి నుండే నగర ఎన్నికలపై దృష్టి పెట్టాలని సూచించారు. వార్డుల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ, పార్టీ బలాన్ని పెంచే చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు. ప్రతి వార్డులో కాంగ్రెస్ విజయాన్ని సాధించి కడప మేయర్ స్థానం కాంగ్రెస్ పార్టీకి దక్కేలా అన్ని శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఆమె స్పష్టం చేశారు.

**ఆర్ఎస్ఎస్ ముసుగు మళ్ళీ తొలగిపోయింది..**

ఆర్.ఎస్.ఎస్. ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబోలె గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ సామ్యవాదం(సోషలిస్ట్), లౌకిక వాదం (సెక్యులరిజం) అనే పదాలను తొలగించాలని కోరారు. బిజెపికి రాజ్యాంగం అవసరం లేదని మనుస్మృతి కావాలని విజయజ్యోతి మండిపడ్డారు. సంవిధానం వీరికి అసహనంగా ఉంటుంది, ఎందుకంటే అది సమానత్వం, లౌకికత్వం, న్యాయం గురించి మాట్లాడుతుంది. ఆర్ఎస్ఎస్-బీజేపీకి అవసరం ఉన్నది భారతీయ రాజ్యాంగం కాదు, మనుస్మృతి. వీరు బహుజనులు మరియు పేదల హక్కులను హరించి, వారిని మళ్లీ గులాములుగా మార్చాలనుకుంటున్నారు. సంవిధానం వంటి శక్తివంతమైన ఆయుధాన్ని వారి నుండి తిసుకోవడం వీరి అసలైన అజెండా. ఆర్ఎస్ఎస్ కలలు నిజం కావు ? మేము వారిని ఎప్పటికీ విజయవంతం కాకుండా అడ్డుకుంటాం. ప్రతి దేశభక్తుడు చివరి శ్వాస వరకు రాజ్యాంగాన్ని రక్షించేందుకు పోరాడతాడు.

**భారత మాజీ ప్రధాని, గొప్ప రాజకీయ విద్యావేత్త పి.వి. నరసింహారావు**

భారత మాజీ ప్రధాని, గొప్ప రాజకీయ విద్యావేత్త స్వర్గీయ పి.వి. నరసింహారావు జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించే కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి హాజరై, పి.వి.గారి చిత్రపటానికి పుష్పాంజలులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ?1991 నుండి1997 వరకు 6 సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా పార్టీకి సేవ చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున 20 సంవత్సరాలు శాసన సభ్యునిగా ,రాష్ట్ర మంత్రిగా,ముఖ్య మంత్రిగా సేవలందించారు. దక్షిణ భారతదేశం నుండి తొలి భారత ప్రధాని పీవీ. ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో తీసుకున్న ఆర్థిక సంస్కరణలు దేశాభివృద్ధికి మలుపు తిప్పినవని, దేశ భద్రత, విదేశాంగ విధానాల్లో తనదైన ముద్ర వేశారని తెలిపారు. పార్టీలో పలు స్థాయిలలో పనిచేసిన నాయకులకు పి.వి.గారి జీవితం ప్రేరణగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. డిసిసి ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు రహమతుల్లా ఖాన్, మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నీలం, రఫీ ఖాన్ స్టేట్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి, సుశీల్ కుమార్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మామిళ్ళ బాబు ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు, ముబారక్, కడప నగర మైనార్టీ అధ్యక్షులు, శీలం గంగయ్య, సద్దాం, సిద్ధిక్, సయ్యద్ షామీర్ హుస్సేన్, యూసుఫ్, హమీద్, కరిముల్లా ఫజులుల్లా, పాలెం హరిప్రసాద్, పాలగిరి శివ, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్తాన్ లో ఆత్మాహుతి దాడి



**లాహోర్ :** పాకిస్థాన్లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్లో మరోసారి నెత్తురు చిందింది. ఉత్తర వజీరిస్థాన్ జిల్లాలో సైనిక కాన్వాయ్ను లక్ష్యంగా చేసుకుని పాకిస్థానీ తాలిబన్లు జరిపిన ఆత్మాహుతి దాడిలో 16 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో పౌరులతో సహా మరో 24 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. శనివారం జరిగిన ఈ సంఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. స్థానిక ప్రభుత్వ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఒక ఆత్మాహుతి దళ సభ్యుడు పేలుడు పదార్థాలతో నింపిన వాహనాన్ని వేగంగా నడుపుకుంటూ వచ్చి సైనిక కాన్వాయ్ను ఢీకొట్టాడు. దీంతో భారీ పేలుడు సంభవించి సైనికులు ప్రయాణిస్తున్న వాహనాలు ధ్వంసమయ్యాయి. పేలుడు తీవ్రతకు సమీపంలోని రెండు ఇళ్ల పైకప్పులు కూలిపోయాయని, ఫలితంగా ఆరుగురు చిన్నారులు గాయపడ్డారని జిల్లాలోని ఒక పోలీస్ అధికారి వెల్లడించారు. మొదట మృతుల సంఖ్య 13గా ఉన్నప్పటికీ, ఆ తర్వాత 16కి పెరిగినట్టు అధికారులు ధ్రువీకరించారు. ఈ ఆత్మాహుతి దాడికి తామే బాధ్యత వహిస్తున్నట్టు పాకిస్థానీ తాలిబన్కు చెందిన హఫీజ్ గుల్ బహదూర్ గ్రూప్ ప్రకటించుకుంది. 2021లో ఆఫ్ఘనిస్థాన్లో తాలిబన్లు తిరిగి అధికారం చేపట్టినప్పటి నుంచి పాక్ సరిహద్దు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు గణనీయంగా పెరిగాయి. తమ భూభాగం నుంచి ఉగ్రవాదులు దాడులకు పాల్పడుతున్నారని పాకిస్థాన్ పదేపదే ఆఫ్ఘనిస్థాన్పై ఆరోపణలు చేస్తోంది. అయితే, ఈ ఆరోపణలను కాబూల్లోని తాలిబన్ ప్రభుత్వం ఖండిస్తూ వస్తోంది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ ప్రావిన్సులలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ గ్రూపులు జరిపిన దాడుల్లో సుమారు 290 మంది మరణించారని, వీరిలో అత్యధికులు భద్రతా సిబ్బందేనని ఏఎఫ్పీ వార్తా సంస్థ గణాంకాలు చెబుతున్నాయి. తాజా ఘటనతో సరిహద్దు ప్రాంతాల్లో భద్రతాపరమైన ఆందోళనలు మరింత తీవ్రమయ్యాయి.

## ఫోన్ ట్యాపింగ్... తప్పుడు కథనాలంటూ దాడి



**హైదరాబాద్ :** హైదరాబాద్ జూబ్లీహిల్స్ లో ఉన్న మహా న్యూస్ టీవీ చానల్పై భారత రాష్ట్ర సమితికి చెందిన కార్యకర్తలు దాడి చేశారు. కేటీఆర్ కు వ్యతిరేకంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో అభ్యంతరకర వార్తలు ప్రసారం చేస్తున్నారని బీఆర్ఎస్ కార్యకర్తలు ఆరోపించారు. ఆఫీసు ఎదురుగా ఉన్న కార్లతో పాటు .. కార్యాలయం లోపలకు చొచ్చుకు వెళ్లి దాడి చేశారు. రిసెప్షన్ తో పాటు స్టూడియోను కూడా ధ్వంసం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు హఠాత్తుగా దాడితో ఉద్యోగులంతా భయాందోళనకు గురయ్యారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో కేటీఆర్ పై మహాన్యూస్ లో అభ్యంతరకర విషయాలు వస్తున్నాయని..తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారని ఈ దాడి చేసినట్లుగా ప్రకటించుకున్నారు. దాడి సమయంలో మహా న్యూస్ స్టూడియోలో హీరో సూహాస్ ఉన్నారు తన కొత్త సినిమా ఉప్పుకప్పురంబు సినిమా ప్రమోషన్లో భాగంగా ఇంటర్వ్యూ ఇచ్చేందుకు వచ్చారు. దాడులతో ఆయన ఆందోళనకు గురయ్యారు. స్టూడియో ఎదురుగా ఉన్న ఆయన కారును కూడా బీఆర్ఎస్ కార్యకర్తలు ధ్వంసం చేసినట్లుగా తెలుస్తోంది. దాడి తర్వాత ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. దాడి చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పై మండిపడ్డారు. అంతకు ముందు ట్యాపింగ్ వ్యవహారంలో తనతోపాటు పార్టీ నేతలపై దుష్ప్రచారం చేస్తున్న వారికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హెచ్చరికలు జారీ చేశారు. అబద్ధాలు అసత్యాలు దురుద్దేశపూర్వక ప్రచారాలు చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. కొంతమంది వ్యక్తులు మీడియా ముసుగులో కావాలనే ఇలాంటి నీచమైన దుష్ప్రచారం చేస్తున్నారు. కావాలని కొన్ని మీడియా సంస్థలు మరియు కొంతమందితో జట్టు కట్టి ఒక ముఠాగా మారి చేస్తున్న దుష్ప్రచారంపై చట్టపరంగా తగిన సమాధానం చెబుతాము. గత కొన్ని నెలలుగా కొంతమంది విలేకరుల వేషం వేసుకున్న కొంతమంది మీడియా సంస్థల యజమానులు నా పైన వ్యక్తిగతంగా, మా బీఆర్ఎస్ పార్టీ నాయకత్వంపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. పదేపదే వీరు చేస్తున్న వ్యక్తిత్వ హననం వలన మా కుటుంబ సభ్యుల పైన తీవ్రమైన దుష్ప్రభావం చూపిస్తున్నాయన్నారు. మీడియా రూపంలో వీరు చేస్తున్న దాడులు నా శ్రేయోభిలాషులు, పార్టీ నాయకులను, పార్టీ శ్రేణులను బాధ కలిగిస్తున్నాయన్నారు. కేటీఆర్ ఇలాహెచ్చరికలు జారీ చేసిన కాసేపటికే మహా న్యూస్ పై కార్యకర్తలు దాడులు చేశారుఈ దాడి కేవలం ఒక భవనం మీద జరిగింది కాదని, ఇది నేరుగా పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడి అని బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ జర్నలిజం గురించి గొప్పగా మాట్లాడుతుందని, కానీ ఇప్పుడు ఏకంగా ఒక మీడియా కార్యాలయంపైకి తమ మనుషులను పంపి ధ్వంసం చేయించడం వారి ద్వంద్వ వైఖరిని తెలియజేస్తోందని విమర్శించారు. "మీరు అధికారంలో ఉన్నప్పుడు మీ మద్దతుదారులు ఎంతోమందిపై సామాజిక మాధ్యమం వేదికగా అసత్య ప్రచారాలు చేశారు, దూషించారు. అప్పుడు మేము మీ ఇళ్ల మీదకు దాడులకు దిగామా?" అని ఆయన ప్రశ్నించారు. ఇటీవల ఒక టీవీ యాంకర్ ఆత్మహత్య చేసుకున్న ఘటనలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరిపై ఆత్మహత్య ప్రేరణ ఆరోపణలు వచ్చాయి. ఈ కేసు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీఆర్ఎస్ ఈ దాడికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. తమపై ఉన్న ఆరోపణలను కప్పిపుచ్చుకోవడానికి, భయానక వాతావరణం సృష్టించి మీడియా గొంతు నొక్కాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఒకప్పుడు బీఆర్ఎస్కు మద్దతుగా నిలిచిన మహా న్యూస్ ఛానెల్పైనే ఇప్పుడు దాడికి దిగడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. నిజాన్ని ఆపలేరంటూ హెచ్చరిక"మీరు కెమెరాలను పగలగొట్టగలరు కానీ నిజాన్ని కాదు. గొంతులను మూయించగలరు కానీ ప్రశ్నలను ఆపలేరు. ఒక ఛానెల్పై దాడి చేయగలరు కానీ జర్నలిజాన్ని అంతం చేయలేరు'' అంటూ హెచ్చరించారు. ఇది కేవలం తప్పిదం మాత్రమే కాదని, చట్ట ప్రకారం నేరమని స్పష్టం చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## సున్నం చెరువు అక్రమణలను తొలగంచిన హైడ్రా

**హైదరాబాద్ :** మాదాపూర్ సున్నం చెరువు వద్ద ఆక్రమణలను హైడ్రా అధికారులు హైడ్రా అధికారులు తొలగంచారు. గతంలో కుడా సున్నం చెరువు ఎఫ్టీఎల్ , ,బఫర్ జోన్ వేలిసిన అక్రమ నిర్మాణాలు కుల్చివేసారు. తరువాత సున్నం చేరువు సుందరికరణ పనులను చేపట్టారు. సున్నం చేరువు సమిపంలో వ్యాపారులు బోర్లు వేసి ట్యాంకర్ ల ద్వారా నిటిని తోడుతున్నారు. సోమవారం ఉదయం 5:30 గంటల నుంచి భారీ పోలీస్ బందోబస్తు మధ్య సున్నం చేరువు బఫర్ జోన్ లో వున్న వాటర్ బోర్లు గుడిసేలు తోలగించారు. ..

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

**అన్నమయ్య :** కురబలకోట మండలం చెన్నామర్రిమిట్ట వద్ద భారీ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గుర్తు తెలియని లారీ, టెంపో ట్రావెలర్ ను ఢీ కొంది. బాధితులు తిరుమల నుంచీ ఉదయం మూడు గంటలకు కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి కి బయలుదేరారు. బాగేపల్లి కి చెందిన మూడు కుటుంబాలు తిరుమల దర్శన అనంతరం తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదం జరిగింది. టెంపుల్లో ప్రయాణిస్తున్న 14 మందిలో ఘటనా స్థలంలోనే చరణ్, మేఘర్ష్, శ్రావణి అక్కడికక్కడే మృతి చెందారు. మిగతావారికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి స్థానికులు తరలించారు. ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జూలై 2న కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటన

**కుప్పం :** సీఎం చంద్రబాబు జూలై 2 న కుప్పంలో పర్యటిస్తారు. మంగళవారం సాయంత్రం 6:00 గంటలకు కుప్పం చేరుకుంటారు. శాంతిపురం మండలంలోని తిమ్మరాజుపల్లిలో బుధవారం ఉదయం 8:00 గంటల నుండి డోర్ టూ డోర్ క్యాంపెయిన్ లో పాల్గొంటారు. 10:55 గంటలకు తుమిసి వద్దనున్న ఏపీ మోడల్ స్కూల్ వద్ద పబ్లిక్ మీటింగ్ లో పాల్గొంటారు. మధ్యాహ్నం 3:00 గం.కు కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో టాటా డిఐఎన్సి సెంటర్ ను ప్రారంభిస్తారు. 4:20 గం.కు శాంతిపురం మండలంలోని తుమ్మిసి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కు చేరుకొని, తిరుగుప్రయాణం అవుతారు.

## తొమ్మిది కార్లు ఢీ..ప్రయాణికులకు స్వల్ప గాయాలు

**రంగారెడ్డి :** శంషాబాద్ ఎయిర్పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధి ఔటర్ రింగ్ రోడ్డు పై రోడ్డు ప్రమాదం జరిగింది. అర్ధరాత్రి చెన్నమ్మ హోటల్ సమీపంలో ఒకదానికి ఒకటి కారు ఢీ కొట్టాయి. వరుసగా 9 కార్ల ఢీ కొనడంతో వాహనాలు . పాక్షికంగా ద్వంసం అయ్యయి. కార్లలో ప్రమాణిస్తున్న ప్రయాణీకులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ముందుగా ఒక కారు డ్రైవర్ మితిమీరిన వేగం తో దూసుకొని వచ్చి సడన్ గా బ్రేక్ కొట్టాడు. దాంతో కారు కంట్రోల్ తప్పి వరుసగా తొమ్మిది కారులు ఢీ కొన్నారు. ఘటనతొఓ రెండు కిలోమీటర్ల ట్రాఫిక్ జామ్ ఏర్పాడింది. ఓఆర్ఆర్ సిబ్బంది తో పాటు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ను క్లియర్ చేసారు.

## వారం రోజుల్లో వారాహి అమ్మవారి ఆలయాన్ని నిర్మించాలి

**తిరుపతి :** తిరుచానూరు వద్ద గుర్తు తెలియని దుండగులు కొద్దిరోజులు క్రితం ద్వనీసం చేసిన ఆది వారాహి అమ్మవారి ఆలయాన్ని బీసీవై అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ సోమవారం ఉదయం పరిశీలించారు. తరువాత అయన మాట్లాడుతూ ఇసుక దోపిడీకి అమ్మవారి ఆలయం అడ్డుగా ఉందని ద్వనీసం చేశారు. ఈ దుశ్చర్య పై చర్యలు తీసుకోకపోవడంతో మరో రెండు రోజుల తర్వాత నాగలమ్మ ఆలయాన్ని ధ్వంసం చేశారు. హిందు ఆలయాలు, హిందు ధర్మం, హినీదువు పండుగల పై దాడులు జరుగుతున్నాయి. వారాహి దేవాలయ నిర్మాణానికి అనుమతులు ఇచ్చి,ప్రభుత్వమే ఆలయం నిర్మాణానికి పూనుకోవాలి. ఈ వివాదానికి కారణము అయిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వానికి వారం రోజుల్లో గడువు ఇస్తున్నాం. స్పందించకుంటే ఉద్యమిస్తామని అన్నారు.

## ఆ పేరు మారిస్తే అందోళన కు దిగుతాం : మాజీ మంత్రి తలసాని

హైదరాబాద్ : హైదరాబాద్ జంట నగరాలకు ఎంతో మంది వస్తుంటారు. అలాంటి వారికి కడుపునిండా అన్నం పెట్టాలని అన్నపూర్ణ క్యాంటీన్ ల పథకం కేసీఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అన్నపూర్ణ పేరు మార్చాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. పేరు మార్చాలని ఉదేశ్యం ఉంటే జీహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి మెజార్టీ సభ్యుల ఆమోదం మేరకు నిర్ణయం తీసుకోవాలి. కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ప్రజలకు ఇచ్చింది. 6 గ్యారెంటీలకు నచ్చిన పేరు పెట్టుకోండి..మాకు అభ్యంతరం లేదు. అన్నపూర్ణ పేరు మార్పు మంచి పద్దతి కాదు. ఆరోగ్య శ్రీ తెచ్చిన రాజశేఖర్ రెడ్డి పేరే మేము కొనసాగించడం జరిగింది. అన్నపూర్ణ అనగానే అమ్మవారు గుర్తు వస్తారని అన్నారు. అన్నపూర్ణ పేరు మార్చాలని ప్రభుత్వానికి ఉద్దేశ్యం ఉంటే కౌన్సిల్ సమావేశంలో చర్చ పెట్టీ, ఓటింగ్ పెట్టాలని మేము డిమాండ్ చేస్తున్నాం. ఈరోజు పిజేఆర్ ఫ్లై ఓవర్ ఓపెన్ చేస్తున్నారు.. మరి అది కట్టింది ఎవరు. తిమ్మిని బొమ్మిని చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటే. పేరు మార్పు వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు.

Edited, Published and Owned by **Ramancharla Srikanth** & Printed by **V. Raj Kumar** at **RK PRINTERS**, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 & Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. **RNI No.: TELTEL/2023/90269**. Editor: **RAMANCHARLA SRIKANTH**, Mob: **9963708331**, Email: telanganashaan331@gmail.com